
# అంధకారంలో పోరాటం



రాత్రి రెండు గంటలైంది. ఎక్స్‌పెరిమెంట్ పూర్తయిపోయింది. లాబ్ అంతా సర్ది బైటపడేసరికి మూడయింది.

డిసెంబర్ నెల చలి చంపేస్తోంది. అదిగాక ఈ వేళెందుకో మింటికీ, మంటికీ మధ్య నల్లని మబ్బులు పొరలు పొరలుగా కమ్ముకున్నాయి. చిమ్మచీకటి తెరలు తెరలుగా అలుముకుని ఎక్కడినుండో పరుగు పరుగున వస్తోంది చలిగాలి. అందరి భుజాల మీద చెయ్యివేసి పలకరించి మరీ ముందుకు పోతోంది.

విశ్శబ్దం విరుచుకుంటోంది
నా అడుగులు భారంగా పడుతున్నాయి
మనసు మగతగా ఉంది
బద్ధకం బరితెగిస్తోంది—

వరండా వైపు వెళ్ళాలనుకున్నాను. అప్రయత్నంగా నాచూపు సంగ్రామ్ గది వైపు మళ్ళింది. రీడర్ సంగ్రామ్ గదిలో ఇంకా లైటు వెలుగుతోంది. ఇంత రాత్రిపూట అతదు రాడు. ఆయన స్టూడెంట్స్ అంటే రీసెర్చ్ స్కాలర్స్ ఎవరో వచ్చుంటారు.

మామూలుగా రీసెర్చ్ చేసే వాళ్ళందరూ ఫ్లాస్కుల్లో టీ పట్టుకుని రావడం అలవాటు. బాగా చలిగా వుండడంవల్ల కాస్త టీ త్రాగాలనిపించింది. నా దగ్గర లేదు. బహుశా వీళ్ళదగ్గర ఉండవచ్చు!

'టీ'కోసం సంగ్రామ్ గదిలోకి వెళ్ళాలనుకున్నాను. ఏ.సి ఆన్ చేసుంది. కొన్ని ప్రయోగాలకు అది తప్పనిసరి. తలుపు తట్టబోయాను. కానీ అది ముందుకే వేసుంది. రూమ్ తలుపులు తెరిచి లోపలకు అడుగుపెట్టాను.

యథాలాపంగా లోపలికి ప్రవేశించిన నాకు అక్కడి దృశ్యాన్ని చూడగానే ఒళ్ళు ఝల్లుమంది. గుండె వడివడిగా కొట్టుకోసాగింది! రక్తం వేడెక్కింది. నరాలన్నీ జివ్వుమన్నాయి! చూడకూడదనుకున్నా చూడకుండా ఉండలేకపోయాను. అసలేం జరుగుతుందో నేనెలా ప్రవర్తించాలో కూడా అర్థం కాలేదు. మొత్తానికి ఆ దృశ్యం నా కళ్ళను పేల్చి వేసింది.

నన్ను శిలా సదృశంగా మార్చి వేసింది.

అక్కడ ఆ సమయంలో.....

పవిత్రమైన ఆ పరిశోధనాలయంలో దేవాలయంలో

రెండు నగ్నదేహాలు కామాన్ని తీర్చుకుంటున్నాయి.

స్త్రీ పురుషులిద్దరూ ఒకరిలో ఒకరు కలిసిపోతున్నారు. అతదు... ఫిజియాలజీలో రీసెర్చ్ అసోసియేట్, ఆమె... పారా సైకాలజీలో పోస్ట్‌డాక్టరల్ ఫెలో. ఇద్దరూ నాకు బాగా తెలుసు.

వ్యభిచారం నేరమని లెక్చర్లు దంచే రామనాథం— అందరు ఆడాళ్ళ శీలాన్ని తక్కువగా అంచనా వేసే మాధవి.

కానీ ఇద్దరూ చేస్తున్నదేమిటి?

పచ్చి వ్యభిచారం—

అతనికి పెళ్ళయింది. ఇద్దరు బిడ్డలు.

ఇకపోతే ఆమె కొత్త పెళ్ళికూతురు. ఇంకా కాళ్ళ పారాణి కూడా ఆరలేదు.

నా మనస్సంతా వికలమైపోయింది.

ఏదో తెలియని బాధ నన్నావహించసాగింది.

గిరుక్కున వెనక్కి తిరిగాను. యూనివర్శిటీ క్యాంపస్ దాటాను. అక్కడో చిన్న టీ కొట్టుంది. అక్కడికిపోయి కూర్చున్నాను. "టీ కావాలా సార్?" కుర్రాడు అడిగాడు.

"ఆ! ఓ టీ స్ట్రాంగ్‌గా ఇవ్వు"

ముభావంగా కూర్చున్నాను. టైం నాలుగైంది.

వేడిసెగలు కక్కుతున్న ఆ టీని ఆ చలిగాలిలో ఆ రాత్రి సమయంలో తాగుతుంటే... ఏదో విచిత్రమైన అనుభూతి.

టీ గొంతుని మండిస్తోంటే ఇందాకటి దృశ్యం గుండెను మండిస్తోంది— వీళ్ళని రీసెర్చ్ చేయమని ప్రభుత్వం నిధులు సమకూరుస్తోంది. కానీ వీళ్ళు చేస్తున్నదేమిటి?!

మొన్న మాటల సందర్భంలో రాజేశ్వరరావు అన్నాడు ఇలాంటివెన్నో జరుగుతుంటాయని. నేను నమ్మలేదు.

కానీ, ఇప్పుడు కళ్ళారా చూశాక నమ్మకుండా ఎలా ఉండగలను?

"ఆఫ్టరాల్! వుయ్ ఆర్ హ్యూమన్ బీయింగ్స్. ఉయ్ షల్ ఎంజాయ్. డోంట్ టేక్ దైమ్ సీరియస్.'

మంచి అమ్మాయి కాదనుకున్న సీతారత్నం మాటలు గుర్తుకొచ్చాయి.

ఈ సొసైటీ హైలీ ఎడ్యుకేటెడ్! ఇక్కడంతా ప్రొఫెసర్స్, రీడర్స్, స్కాలర్స్. కానీ బుద్ధులు మాత్రం.....

ఆలోచనలకు అంతరాయం కలిగింది.

ఓ పోలీస్ 27 సంవత్సరాల అమ్మాయిని టీకొట్టులోకి లాక్కొచ్చాడు. "సార్! మీకు పుణ్యముంటుంది. వన్నొదిలి పెట్టండ సార్!" ఆ అమ్మాయి వేడు

కుంటోంది.

"ఛత్! నోర్మూయ్ !! పాడుపని చేసినప్పుడు లేదూ?! ఇప్పుడు గుర్తుకొస్తుందా పుణ్యం?"— "రేయ్ ! ఒక టీ స్ట్రాంగ్‌గా కలిపివ్వరా!"

పోలీసోడి దర్బార్

"అలాగే సార్!" టీ కొట్టు కుర్రాడి వినయం

"సార్! ఎంతో అవసరముండి ఈ పని చేశానండీ! మా బాబుకి మందు కావాలి సార్!" ఆమె మాటలకు గట్టిగా నవ్వాడు పోలీసోడు.

"నీలాంటి ప్రతిముండా ఇదే కబుర్లు చెబుతుంది నోర్మూసుకుని కూచో! పోలీస్ స్టేషన్ వెళ్ళాక య స్.ఐ గారితో చెప్పుకో! అంతవరకు నేనేమీ వినదలుచుకోలేదు"

పోలీసోడి మాటలకు తిరుగులేనట్టుంది.

ఆమె నోరు మూతపడింది.

"సార్! ఇంతకీ ఆమె ఏం చేసిందండీ? " అడిగాను నేను. సార్ అంటే చాలు పొంగిపోతారెంతోమంది

దాంతో మన పని సులభమవుతుందని చెప్పేవాడు బావిగాడు. వాడి చిట్కా ఉపయోగించాను.

పోలీసోడు నావైపు ఎగాదిగా చూసి "ఇది పార్కులో దర్జాగా వ్యభిచారం వెలగబెడుతూంటే పట్టుకొన్నాను. మరీ బరితెగించింది"...

పోలీసోడి మాటలకు అడ్డు తగిలాను నేను

"వ్యభిచారం ఈమె ఒక్కతే చేయలేదుగా! ఆ మగవాడెక్కడ?..."

నా మాటలకు ఆమె అందుకుంది.

"ఆ ఎదవసచ్చినోడు ఈసార్‌కి యాభై రూపాయలిచ్చి ఎల్లిపాయినాకైతే పైసా ముట్టలా"

ఆమె మాటలకు నేను స్థాణువైపోయాను.

"ఛత్! నోర్మూయ్ !! బద్మాష్ ముండా! మాట్లాడావంటే పెక్కెలిరగతంతా! జాగ్రత్! బాంచత్! లఫ్డీ...! నేనంటే ఏమనుకున్నావో?!" హూంకరించాడు పోలీసోడు.

పోలీసోడి మాటలకు ఓ పెద్ద మనిషన్నాడు..

"మాడమ్మా! నీ దగ్గరున్నదేదో నువ్వు కూడా ఇస్తే ఈయన నిన్నొదిలి పెడతాడేమో?!"—

ఆమె దాదాపు ఏడుస్తూ అంది.

"నా దగ్గరేమీ లేదు. ఉంటే ఇచ్చేదాన్నే!"

"ఉట్టి అబద్ధాలకోరు! నీ దగ్గరుందో లేదో మాస్తాగానీ రా!.. గదిలోకి రా!" కానిస్టేబుల్ (పోలీసోడు) ఆమెను అందరి ఎదుటే గదిలోకి తోసుకుంటూ తీసికెళ్ళాడు.

అందరూ ముసిముసిగా నవ్వుకుంటున్నారే గాని ఒక్కరూ అన్యాయమని ఆక్రోశించడం లేదు

అన్యాయాన్ని ఆపలేని నా అసమర్థతతో నేను లేచి నిలబడ్డాను. దబ్బిచ్చి నా రూంకేసి నడవసాగాను.

రీసెర్చ్ పేరుతో ఒకచోట వ్యభిచారం జరిగితే ఎవరూ అడ్డుకోలేకున్నారు. గత్యంతరం లేక పొట్టకూటికోసమో, కన్న తీపి చంపుకోలేకనో కాలు జారితే అదో మహానేరమవుతోంది.

ఎక్కడుంది లోపం?

ఏమిటి దీనికి పరిష్కారం?

ప్రశ్నలతోనే తెల్లవారింది

సూర్యుడు ఎప్పట్లాగే తూర్పున ఉదయించాడు

పదిగంటలకల్లా యూనివర్శిటీ యథా ప్రకారం నన్ను పిలిచింది. దారిలో ఓ శ్మశానవాటిక ఉంది.

అక్కడ పదేళ్ళబ్బాయి శవాన్ని ఒళ్ళో పెట్టుకుని ఏడుస్తోంది రాత్రి పోలీసోడు పట్టుకొన్న అభాగ్యురాలు

ఫిజియాలజీ లాబ్‌లో మాధవి ఎవరితోనే అంటోంది—

"అత్తగారు శ్రావణ మంగళగౌరీవ్రతం చేసుకోవాలి రమ్మని ఉత్తరం వ్రాశారు. వెళ్ళకపోతే ఎలా? పైగా శ్రీవారిని చూసి కూడా నాలుగు రోజులైంది"

నాకైతే చాలా ఆశ్చర్యంగా ఉంది. కాని ఆమె రాత్రి జరిగిన విషయాన్ని చాలా తేలికగా తీసుకున్నట్టుంది—

రామనాథం యం.ఓ. తీసుకుంటూ రాజేశ్వరావుతో అంటున్నాడు.

"నా భార్య చాలా గొప్పది దొడ్డ ఇల్లాలు. అవసరమని రాయాలేగానీ ఎంతైనా పంపిస్తుంది. దేనికనికూడా అడగదు. నేను చాలా మందితో గడిపే మాట వాస్తవమే గానీ.. ఆమె స్థానం మాత్రం ఇక్కడ... హృదయంలో"

నాకా మాటలెందుకో స్వాంతన కలిగించలేకపోతున్నాయి.

అస్తవ్యస్తంగా ఉన్న ఆలోచనలు—

అంధకారంలోంచి తన్నుకు రావాలని చేస్తున్న ప్రయత్నాలు—

యోచిస్తూ కూర్చున్న నన్ను భుజం తట్టి లేపాడు నా గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ యుగంధర్—

"కూర్చుంటే లాభం లేదు. ఎప్పుడూ ఏవో ఒకటి చేస్తూ ఉండాలి. అసలు ప్రయత్నించకపోవడంకన్నా ప్రయత్నించి విఫలంకావడం మిన్న. మనం రాజీ పడకుండా నెరవేర్చాలి. అవసరమైతే పోటీ పడాలి. నిశ్శబ్దంగా ఓటమిని భరించడం కన్నా గెలుపుకోసం ఆరాటపడి అందుకోలేకపోయినా ఆత్మసంతృప్తయినా మిగులుతోంది. గెలుపు ప్రధానం కాదు. పోరాటం ముఖ్యం. జీవితంతో రాజీ పడటం కాదు. పోటీపడడం నేర్చుకో!"

నా కళ్ళు తెరిపించాయా మాటలు. ○

రవితేజ

## అలవాటుపడిన ప్రాణులం!?

సర్వం త్యజించి నట్లు,
అహాన్ని జయించినట్లు,
ముసుగు తొడుక్కొని
తూర్పున తలెత్తిన సూరీడా!
లాలిస్తున్న లేలేత
కిరణాల హస్తాలు చాపి
కొండంత అండలా మమ్మల్ని
మభ్యపెట్టి.. మెలమెల్లగా
మానెత్తిన జేరిపోతావు కదయ్యా..!!

కాలుస్తున్న కత్తుల
కిరణాలు మా మీద వదిలి,
మలమల మాడ్చినందుకు,

ప్రపంచం నిన్ను
పదవీచ్యుతుణ్ణి చేసిందని
మొహం గంటుపెట్టుకుని
గుట్టుగా జలగర్భంలోకి
జారుకొంటున్న... సాయంకాలపు
గడుసు సూరీడా!
రంగులుమార్చే నీ జిత్తుల మోహాలు
మాకు బాగానే తెలుసు!
గూబవాయగొట్టిన
జ్ఞాపకాల్ని సైతం నిద్ర పుచ్చి,
రేపుదయం మళ్ళీ....
లాలిస్తున్న కిరణాలు చాచి.....,
నీ రాజకీయం తెలీక కాదు!
అలవాటుపడిన ప్రాణులంకదా!!

మా 'మరుపు' మీద దోసిళ్ల కొద్దీ
నమ్మకాన్ని మూలధనం చేసికొని,
వాగ్దానాల విందులు కుడిపించి......,

మా నెత్తిన కూర్చునే
ఓట్ల పండుగ కోసం...
లాలిస్తున్నట్లుగా చూపులు సారించి.....,

వేలాది సూరీళ్లు మాకు
మెలకువ లోనూ
జోగుతుండడం నేర్పించారు!!
అలవాటుపడిన ప్రాణులం మరి!!

రావులపల్లి సునీత